క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఆలయ అభివృద్ధి పనులకు విజయవాడకు చెందిన భక్తులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ లబ్బీపేటకు చెందిన ఎం.కృపారావు దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావుకు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అసిస్టెంట్ కమిషనర్ రంగారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

మంచినీటి పైపులైన్ పనులకు భూమిపూజ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 40వ డివిజన్‌లో మంచినీరు పైపులైన్ నిర్మాణ పనులకు ఆ డివిజన్ కార్పొరేటర్ యర్రబ్ల అంజనేయరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.4లక్షల వ్యయంతో పనులు ప్రారంభించామన్నారు. డివిజన్‌లోని మైనంపాటి వారి వీధి, ఎంసీ దాస్ రోడ్డు ప్రాంతాలకు మంచినీటి సరఫరా కోసం ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు మంచినీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ జాస్మిన్, ఎమినిటీస్ సెక్రటరీ, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మరుపిళ్ల చిట్టికి ఘన నివాళి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సర్దార్ మరుపిళ్ల చిట్టి 54వ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీనగరాల సంఘం ఆధ్వర్యంలో చిట్టినగర్‌లోని చిట్టి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సంఘ గౌరవ అధ్యక్షులు ఎన్వీ రావు, అధ్యక్షుడు నల్లాని సూర్యారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బాయన శేఖర్‌బాబు, సంయుక్త కార్యదర్శి పోట్నూరి శివ, స్థానిక నాయకులు, పెద్దలు నివాళులర్పించారు. మరుపిళ్ల చిట్టి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్ ఆధ్వర్యంలో చిట్టి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మరుపిళ్ల వాసు, మజ్జి సత్యనారాయణ, పోతిన సాంబశివరావు, పోతిన సర్వేష్, కె.నరసింహారావు, పోట్నూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెన్నం జ్యోతి సురేఖ మరిన్ని విజయాలు సాధించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారత ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ఇటీవల జరిగిన ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్–4 పోటీలలో అద్భుతమైన ప్రదర్శన చూపించి దేశానికి గర్వకారణంగా నిలిచారని ఆంధ్రప్రదేశ్ ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోన్ ఎఫ్‌జీఎం సీవీఎస్ భాస్కరరావు అన్నారు. ఇటీవల ఆమె సాధించిన విజయాలను పురస్కరించుకుని సురేఖ స్వగృహంలో ఆమెను కలిసి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ సురేఖ బరిలోకి దిగిన మూడు విభాగాల్లో రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకం గెలుచుకోగా, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ప్రపంచ రికార్డు సృష్టించటం అభినందనీయమన్నారు. ఆమె భారతదేశానికి మరిన్ని పతకాలు సాధించాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేఖ తండ్రి వెన్నం సురేంద్ర, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

చిట్టిబాబుకు సేవారత్న పురస్కారం

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన తెలుగు కళావాహిని సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబుకు సేవారత్న పురస్కారం లభించినట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కర్నాటకకు చెందిన సద్గురు రామ్‌నారాయణ్ మఠ్ ప్రతి ఏటా ఆధ్యాత్మిక, కళాసేవా రంగాల్లో వారి వారి సేవలను గుర్తించి పురస్కారం అందజేస్తుంది. 2025 సంవత్సరానికి గాను చిట్టిబాబుకు శుక్రవారం కర్నాటకలోని చిక్‌బల్లాపూర్‌లో ఈ పురస్కారం ప్రదానం చేశారు.

అపారిశుద్ధ్యానికి జంక్షన్

- కంపు కొడుతున్న రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు
- స్టేషన్ పరిసరాలలో యథేచ్ఛగా బహిరంగ మూత్రవిసర్జనలు
- గుట్టలుగా పేరుకుంటున్న చెత్త వ్యర్థాలు
- స్టేషన్‌కి రావాలంటే ముక్కు మూసుకోవాల్సిందే

విజయవాడ రైల్వేస్టేషన్...రాష్ట్రంలో అతి పెద్ద రైల్వే స్టేషన్... దక్షిణ భారత దేశంలో అతి ప్రధానమైన రైల్వే జంక్షన్. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఇక్కడి నుంచి రైలు సర్వీసులు అందుబాటులో ఉంటాయి. నిత్యం లక్షల్లో ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి గొప్ప పేరున్న విజయవాడ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు మాత్రం అతి ఘోరంగా ఉంటాయి. అటువైపుగా వెళుతుంటే ముక్కు మూసుకోవాల్సిందే.



అనధికార మూత్రశాలలుగా స్టేషన్ తూర్పు ప్రధాన రోడ్డు



అధ్వానంగా మారిన రైల్వేస్టేషన్ రోడ్డు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ అనుకూల పద్ధతుల వినియోగంలో జాతీయ స్థాయిలో అనేక అవార్డులను సొంతం చేసుకుంటున్న విజయవాడ రైల్వే డివిజన్ వాస్తవంలో స్టేషన్ పరిసర ప్రాంతాలలో ఎక్కడ చూసినా మల, మూత్ర విసర్జనలతో, గుట్టలుగా పేరుకుంటున్న వ్యర్థాలతో అధ్వానంగా ఉంటోంది. స్వచ్ఛతా హి, స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛతా పక్వాడా ఇలా అనేక పేర్లతో రైల్వే స్టేషన్‌లు, అధికారుల కార్యాలయాలలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం, సిబ్బందితో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలతో ప్రచారం చేసుకుంటున్న రైల్వే అధికారులు స్టేషన్ ప్రవేశ మార్గాలు, పరిసర ప్రాంతాలలో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణాన్ని మాత్రం విస్మరించారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

బ్లీచింగ్ చల్లితే సరా..!

విజయవాడ రైల్వే స్టేషన్‌లోకి అడుగు పెట్టాలంటే ముందుగా ముక్కుపుటలు అదిరిపోయే దుర్గంధాన్ని దాటుకుని వెళ్లాల్సిన దుర్భర స్థితి నెలకొంది. స్టేషన్ ఎదుట పార్కింగ్ ప్రదేశం, రైల్వే ఎస్పీ కార్యాలయం రోడ్డు, ఆల్ఫా హోటల్ రోడ్డు, రైల్వే హాస్పిటల్ రోడ్డు, రైల్వే స్టేడియం తదితర ప్రాంతాలలో బహిరంగ మూత్ర విసర్జనలతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ ఉంటుంది. పారిశుద్ధ్య అధికారులు ప్రతిరోజు ఆయా ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించి సరిపెడుతున్నారే గాని సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదు.

ఎక్కడ చూసినా చెత్త వ్యర్థాలే...

రైల్వేస్టేషన్ బయట ఎక్కడ చూసినా చెత్త వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కార్యాలయాలు, దుకాణాలు, రైల్వే ఆసుపత్రిలోని వ్యర్థాలు సైతం స్టేషన్‌కు చేరుకునే ప్రధాన రోడ్ల పక్కనే పడేస్తున్నారు. ప్రతి రోజు వాటిని తొలగించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది అటుగా కన్నెత్తి చూడకపోవడంతో చెత్త వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. వీటి కారణంగా అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

కనిపించని టాయిలెట్ సూచికల బోర్డులు...

నిత్యం రద్దీగా ఉండే విజయవాడ స్టేషన్ పరిసర ప్రాంతాలలో స్టేడియం వద్ద ఒకటి, కరుణా హోటల్ సెంటర్‌లో ఒక టాయిలెట్‌లు ఏర్పాటు చేశారు. కాని అవి ఎక్కడ ఉన్నాయో తెలియజేసేలా ఎటువంటి సూచికల బోర్డులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితిలో ప్రయాణికులు, స్థానికులు బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు. ప్రతి రోజు దుర్గంధం మధ్యే విధులకు హాజరయ్యే రైల్వే అధికారులకు విషయం తెలిసినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రైల్వే ఆసుపత్రి వ్యర్థాలను స్టేషన్ రోడ్డు పక్కనే పడేసిన దృశ్యం



కోచింగ్ డిపో ఎదుట పేరుకుపోయిన వ్యర్థాలు

25న చలో విజయవాడ మహాధర్నా



మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన పీడీఎస్‌యూ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీన చలో విజయవాడ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీ, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ పీడీఎస్‌యూ కార్యాలయంలో మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పాఠశాలల విలీన ప్రక్రియ వల్ల వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయని చెప్పారు. విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో వివిధ రకాల పేర్లతో జరుగుతున్న ఫీజుల దోపిడీ అరికట్టాలని అన్నారు. 2024 – 25లో తల్లికి వందనం పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ. 3వేలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి 25న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను, రాష్ట్ర కోశాధికారి రూప శంకర్, రాష్ట్ర నాయకులు నాగరాజు, శ్రీను, షాహీద్, నవీన్, దినేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలి

సీపీఎం పశ్చిమ నగర కమిటీ డిమాండ్



రామరాజ్యనగర్ ఏఈ సతీష్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్యబాబు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఏకలవ్యనగర్‌లో విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలని సీపీఎం పశ్చిమ నగర కమిటీ డిమాండ్ చేసింది. ఏకలవ్యనగర్‌లో నివసిస్తున్న ముఠా కార్మికుడు జి.రాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది రెండు రోజుల క్రితం పాత మీటర్‌ను తొలగించి స్మార్ట్ మీటర్‌ను బిగించారు. సమాచారం తెలుసుకున్న సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు శుక్రవారం అదానీ స్మార్ట్ మీటర్‌ను తొలగించాలని కోరుతూ రామరాజ్యనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభ్యంతరాలను ప్రభుత్వం పట్టించుకోకుండా స్మార్ట్ మీటర్ల బిగింపు చర్యలు చేపట్టడం ప్రజావ్యతిరేక పాలన అన్నారు. విద్యుత్ రంగం సంస్కరణల పేరుతో సామాన్య మధ్య తరగతి ప్రజలను దోపిడీ చేస్తే చూస్తూ ఊరుకోమని, ఐక్య ఉద్యమాల ద్వారా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ట్రూ అప్, సర్‌చార్జ్, ఓవర్ లోడ్ చార్జీల పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. విద్యుత్ సంస్కరణలు ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడాలి గానీ కార్పొరేట్ అదానీ కంపెనీ కోసం కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు ఎండీ మస్తాన్, అప్పలరాజు, బాధితుడు రాజు పాల్గొన్నారు.

ప్రజాధనం బాబాలు, స్వాములకు ధారాదత్తం



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక కార్యదర్శి వెలగా శ్రీనివాస్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజల సంపదను పాలకులు స్వాములు, బాబాలకు ధారాదత్తం చేస్తున్నారని వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ఆరోపించారు. అక్రమాలు, మోసాలకు నిలయమైన పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతిని రాష్ట్ర ప్రభుత్వ పండుగగా జరపడాన్ని వారు ప్రశ్నించారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పండుగ జరపాల్సింది శాస్త్రీయతకా–మూఢత్వానికా అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక కార్యదర్శి వెలగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఉన్నారని, మదనపల్లిలో కోట్లాది విలువైన హార్స్‌లీ భూములను నకిలీ వస్తువులు ఉత్పత్తి చేసే రాందేవ్‌కు అప్పనంగా ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ధోరణులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో నాగార్జున సాగర్ వంటి అనేక నిర్మాణాల ప్రారంభంలో మతపరమైన క్రతువులు చేయలేదని గుర్తు చేశారు. ప్రముఖ నాస్తికుడు మోతుకూరి అరుణకుమార్, జేవీవీ రాష్ట్ర నాయకులు మురళీధర్, వెనిగళ్ల మురళి మాట్లాడుతూ బాల్యం నుంచి ప్రశ్నించే తత్వం పెరగాలని, ఆ దిశగా పిల్లలో చైతన్యం కలిగించే విధంగా తీర్చిదిద్దే బాధ్యత నేటి తరం మీద ఉందన్నారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు దివికుమార్, పిచ్చయ్య, సత్యనారాయణ, కోటేశ్వరరావు, సూర్యారావు పాల్గొన్నారు.

భాగ్యనగర్ అమ్మవార్లకు దుర్గమ్మ పట్టువస్త్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ తరపున హైదరాబాద్ భాగ్యనగర్‌లోని అమ్మవార్లకు ఆలయ అధికారులు శుక్రవారం పట్టువస్త్రాలను సమర్పించారు. దుర్గగుడి ఈవో శీనానాయక్, ఆలయ ప్రధాన అర్చకులు లింగంభొట్ల దుర్గాప్రసాద్, రంగావఝ్జుల శ్రీనివాసశాస్త్రి ఉప్పుగూడలోని మహంకాళీ దేవాలయంలో అమ్మవారికి, లాల్ దర్వాజాలోని సింహవాహిని అమ్మవారికి, గౌలిపురాలోని మహంకాళీ అమ్మవారికి, సుల్తాన్ షాహిలోని జగదాంబ అమ్మవారికి, హరిబౌలిలోని బేల ముత్యాలమ్మ, మైసమ్మ, అక్కన్న మాదన్నలతో పాటు మీర్ ఆలం మండిలోని మహంకాళేశ్వరలోని అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశిస్తూ ప్రతి ఏటా పట్టువస్త్రాలను సమర్పిస్తున్నామని ఈవో శీనానాయక్ పేర్కొన్నారు.

నవరస నటుడు ఎస్వీ రంగారావు

విజయవాడ కల్చరల్: నవరస నటుడు ఎస్వీ రంగారావు అని రాష్ట్ర నటీనటుల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. శ్రీకళామంజరి, సి.రామ్మోహనరావు కళాపీఠం, ఎస్వీఆర్ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సినీ నటుడు ఎస్వీ రంగారావు 53వ వర్ధంతి సభను తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ ఎస్వీఆర్ యుగం స్వర్ణయుగమన్నారు. ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయగల నటుడని అభివర్ణించారు. కార్యక్రమంలో పీవీఎల్ నృసింహం, హరగోపాల్, నవనీతం సాంబశివరావు, బడే ధర్మారావు, బీజేపీ నాయకులు గణేష్, బడేటి ధర్మారావు ఎస్వీఆర్ సినీ రంగ సేవలను వివరించారు. అనంతరం ఏపీ బిల్డింగ్ కమిటీ అడ్వైజర్ రఘురామరాజును ఘనంగా సత్కరించారు.

భక్తులకు సౌకర్యాల కల్పనే ప్రధానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు సౌకర్యాల కల్పనే ప్రధానంగా పని చేయాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి చెందిన కీలక విభాగాల అధికారులతో ఈవో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహామండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఇంజినీరింగ్ అధికారులు హాజరయ్యారు. ఆషాఢ మాసోత్సవాలు ముగుస్తున్న తరుణంలో భక్తులు, భక్త బృందాల రద్దీ అంతకంతకు పెరుగుతోందని, అందుకు తగిన రీతిలో సదుపాయాలు కల్పించాలన్నారు. దుర్గాఘాట్‌లో మెరుగైన సదుపాయాలతో పాటు ఘాట్‌రోడ్డు నిర్వహణ, క్యూలైన్లలో మంచినీటి సరఫరా మరింత పెరగాలని ఆదేశించారు. వృద్ధులు, వికలాంగులు, చంటి బిడ్డల తల్లులకు తగినన్ని బ్యాటరీ వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వారం లోగా కొండ దిగువన సమాచార కేంద్రం, ప్రసాదాల కౌంటర్లు, క్లోక్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కొండపై అదనపు ప్రసాదాల కౌంటర్లతో పాటు వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలన్నారు. కొంత మంది సిబ్బంది భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, సిబ్బంది తమ ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు, ఏఈవోలు చంద్రశేఖర్, ఎస్.రమేష్‌బాబు, వెంకటరెడ్డి, గంగాధర్, తిరుమలేశ్వరరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ ఉపకేంద్రంలో 11 కేవీ ఊర్మిళానగర్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఊర్మిళానగర్, ఏకలవ్యనగర్, నులకపేట, రెడ్డి కాలనీ, బొమ్మసాని నగర్, పోలేరమ్మ టెంపుల్ రోడ్, బొమ్మారెడ్డి సీతారెడ్డి కాలనీ, వెటర్నరీ కాలనీ, హెచ్‌ఓ ఫంక్షన్ హాల్ ఏరియా, పైప్ డీలర్స్ యార్డ్ తదితర ప్రాంతాలలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు.

గాంధీబొమ్మ ఫీడర్ లైన్ల మరమ్మతులు

భవానీపురం పరిధిలోని 11 కేవీ గాంధీబొమ్మ విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, కోళ్లఫారం రోడ్, డాల్ఫిన్ బార్ రోడ్, ఐటీసీ పెట్రోల్ బంక్ రోడ్, చర్చి రోడ్, గాంధీబొమ్మ రోడ్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఫీడర్ పరిధిలో...

భవానీపురం పరిధిలోని 11 కేవీ హౌసింగ్ బోర్డ్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని ఎమ్‌ఐజీ–2 బ్లాకులు, పోలీస్ స్టేషన్ రోడ్, వీఎంసీ కల్యాణమండపం ఏరియా, హెచ్‌ఐజీ బ్లాకులు, రిలయన్స్ ఫ్రెష్, హెచ్ ఆర్‌టీ సాయి నిర్మాణ్ పరిసర ప్రాంతాలు, కోళ్లఫారం రోడ్, మానవ మందిరం రోడ్, అమృత అపార్ట్‌మెంట్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శాకంబరీదేవి అలంకారంలో కాళీమాత అమ్మవారు



శాకంబరీ దేవి అలంకారంలో మహంకాళీ అమ్మవారు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వెజిటబుల్ కార్వింగ్

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ఆషాఢ మాసం పురస్కరించుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు శుక్రవారం భక్తులకు శాకంబరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉన్న మహంకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతి దేవి అమ్మవార్లను భక్తులు సమర్పించిన మూడు టన్నుల వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో విశేషంగా అలంకరించారు. ఉపాలయాలైన విఘ్నేశ్వరుడు, ఆంజనేయస్వామి, ఉత్సవమూర్తులను కూరగాయలతో అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం వివిధ రకాల కూరగాయలతో రకరకాల పక్షులు, జంతువులు, బొమ్మల కార్వింగ్ తయారు చేసి ఆలయ ముఖ మండపంలో అందంగా అలంకరించారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ షణ్ముఖం దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. భక్తులకు కదంబం ప్రసాదం పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష , కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆలయ ఆధ్యాత్మిక సలహాదారుడు సీహెచ్ విజయకిరణ్, కమిటీ సభ్యులు జి.సత్యం, జగన్, మల్లేశ్వరరావు, విశ్వేశ్వర్ తదితరులు పర్యవేక్షించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) అధ్యక్షుడు కె.కామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రిటైర్డ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కామయ్య మాట్లాడుతూ ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ రిటైర్డ్ ఉద్యోగుల వలె తక్షణమే బకాయిలు అన్ని చెల్లించాలని, 2019 నుంచి నిధుల వినియోగంపై ప్రత్యేక ఆడిట్, సమగ్ర సమీక్ష జరిపించాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి హెడ్ ఆఫీస్ ఉద్యోగులకు ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ, పీఆర్‌సీ బకాయిలు చెల్లించిన విధంగానే పాఠశాల, కళాశాలల్లో పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులకు కూడా ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జనరల్ సెక్రటరీ ఆర్.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ట్రెజరర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీపై అసత్య ప్రచారాలు సరికాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) ఉత్పత్తి చేసిన పాల ప్యాకెట్‌పై ఓ సినిమా పోస్టర్‌ను ముద్రించిందని జరుగుతున్న ప్రచారం పూర్తి అసత్యమని ఎండీ కొల్లి ఈశ్వరబాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24న విడుదల కానున్న సినిమా తాలూకా పోస్టర్‌ను విజయ పాలప్యాకెట్‌పై ముద్రించిందని శుక్రవారం సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. దీంతో దీనిపై ఎండీ మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. పాడి రైతులు, వినియోగదారుల ప్రయోజనాలే ప్రధానంగా విజయ డెయిరీ తన కార్యకలాపాలను సాగిస్తుందని, విజయ ఉత్పత్తులపై ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ఎన్నడూ చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోమని స్పష్టం చేశారు. ఇటువంటి అసత్య ప్రచారాలను కృష్ణా మిల్క్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తోందని, యూనియన్ పరువుకు భంగం కలిగించే విధంగా జరుగుతున్న ప్రచారంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సచివాలయ కార్యదర్శి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సచివాలయ కార్యదర్శి అదృశ్యమైన ఘటన విజయవాడ బీసెంట్ రోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. జి.కొండూరు మండలం వెలగలేరుకు చెందిన గజ్జల లక్ష్మీతిరుపతమ్మ హెచ్.ముత్యాలంపాడు సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తోంది. నాలుగు నెలల క్రితం విజయవాడ బీసెంట్ రోడ్డులోని డివిజనల్ పంచాయతీ కార్యాలయానికి డెప్యూటేషన్‌పై వచ్చింది. ప్రతి రోజు ఉదయం ఆమె భర్త సుబ్బారావు వెలగలేరు నుంచి బైక్‌పై తీసుకువచ్చి తీసుకువెళ్లేవారు. రోజూ మాదిరిగానే గురువారం లక్ష్మీతిరుపతమ్మ భర్త ఆమెను డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద దించి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి తీసుకెళ్లేందుకు ఆఫీసు వద్దకు వెళ్లగా ఆమె ఆఫీసులో లేదు. ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. దీనిపై లక్ష్మీతిరుపతమ్మ భర్త సుబ్బారావు గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

బోన్‌మారో వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): బోన్‌మారో వ్యాధితో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా ప్రాంతానికి చెందిన యువకుడు మహమ్మద్ ఖాదర్ షరీఫ్‌కు పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ శుక్రవారం బాధితుడి సోదరుడు మొయిన్‌కు రూ.50వేలు అందజేశారు.

